కమీషన్ల కక్కుర్తి..!



ఖమ్మం మున్సిపల్ కార్యాలయం

కాసులుంటే కేఎంసీలో పని అయినట్టే..

- నిబంధనలు పాటించని పలువురు నిర్మాణదారులు
- టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆరోపణల వెల్లువ
- ఏళ్ల తరబడిగా ఫిర్యాదులు బుట్టదాఖలు
- నోటీసుల పేరుతో కాలయాపన

ఖమ్మంమయూరిసెంటర్: ఒక పక్క ఖమ్మం నగరం విస్తరిస్తోంది.. భవన నిర్మాణాలు పెరుగుతున్నాయి.. అదే స్థాయిలో నిబంధనల అతిక్రమణ కూడా సాగుతోంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు కాసులపైనే దృష్టి సారించడంతో నగరంలో అక్రమ నిర్మాణాల సంఖ్య పెరుగడంతో పాటు బాధితులకు న్యాయం జరగడం లేదు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే బాధితులనే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అలాగే ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో కూడా కాసులు చెల్లించిన వారికే ప్రాధాన్యత లభిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్త చట్టం ప్రకారం నిర్మాణ అనుమతులు ఇస్తున్న అధికారులు.. ఏమైనా నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం సంబంధిత నిర్మాణదారులతో కుమ్మక్కై పాత చట్టం ప్రకారం నోటీసులు ఇస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించే ఏ భవనానికైనా మున్సిపల్ యాక్ట్ ప్రకారం నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. దీనిలో ప్రధానంగా భవనానికి సెట్ బ్యాక్ వదిలి నిర్మాణం చేయాలి. భవనం నిర్మించే ప్రాంతంలో పక్కన రోడ్డు, ఇతర నిర్మాణాలు, ఖాళీ స్థలం వంటివి ఉంటే వాటి హద్దుల్లోకి వెళ్లకుండా ఏదైతే అనుమతికోసం జత చేసిన పత్రాల్లో ఉన్న కొలతల ప్రకారం నిర్మాణాలు చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా స్టిల్ట్, సెల్లార్‌లలో సైతం సెట్ బ్యాక్ లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా.. అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. టౌన్ ప్లానింగ్‌లోని ఇకరిద్దరు అధికారుల కాసుల కక్కుర్తి వల్ల నగరంలో విచ్చలవిడిగా నిర్మాణాలు సాగుతున్నాయి.

ఖమ్మం రూరల్ మండలం సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యంకు నగరంలోని బుర్హాన్‌పురం రెవెన్యూ పరిధి వెంకటేశ్వర కాలనీలో స్థలం ఉంది. పక్క వ్యక్తి బహుళ అంతస్తుల నిర్మాణం చేస్తూ తన స్థలంలో కొంత భాగం ఆక్రమించాడని 2021, అక్టోబర్‌లో ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా.. టౌన్ ప్లానింగ్ అధికారులకు బదలాయించారు. అయినా తన స్థలంలోకి వచ్చిన నిర్మాణాలను అడ్డుకోకుండా.. అధికారులు తననే ఇబ్బందులు పెట్టేలా వ్యవహరిస్తుండడంతో కలెక్టర్, సీడీఎంఏ అధికారులకు సైతం ఫిర్యాదులు చేశాడు. కానీ, నాటి నుంచి నేటి వరకు ఫిర్యాదుదారుడి సమస్యను అధికారులు పరిష్కరించలేదు. కొత్త చట్టం ప్రకారం నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అధికారులు.. నిబంధనలు అతిక్రమిస్తే మాత్రం పాత చట్టం ప్రకారం నోటీసులు ఇస్తున్నారని సుబ్రహ్మణ్యం ఆరోపిస్తున్నారు. సుబ్రహ్మణ్యంలా ఫిర్యాదులు ఇచ్చిన అనేక మంది తమ సమస్యలు పరిష్కారం కోసం కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.


సుబ్రహ్మణ్యం, బాధితుడు

కమీషన్ ఇస్తే చాలు..

ఖమ్మం నగర పరిధిలో ఇంటి నిర్మాణం నుంచి వ్యాపార సంస్థలకు సంబంధించిన బహుళ అంతస్తుల నిర్మాణాల వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. త్వరగా అనుమతులు ఇప్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం టీఎస్ బీపాస్ తీసుకొచ్చినప్పటికీ ఏదో ఒక కొర్రీలు పెడుతూ అనుమతులను నిరాకరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టే వారి నుంచి కమీషన్లు తీసుకుని అనుమతులను వెంటనే మంజూరు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇచ్చిన అనుమతుల ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మిస్తున్నా తమకేమి పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వాటిని బుట్టదాఖలు చేయడం, పదే పదే కార్యాలయాల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేస్తుంటే నిర్మాణాల వద్దకు వెళ్లి తూతూమంత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. నూతన చట్టం ప్రకారం అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాల్సిన ఖమ్మం టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి కాలయాపన చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు కాసులకు కక్కుర్తి పడి బాధితులను కేఎంసీ కార్యాలయం చుట్టూ తిప్పినట్లు తెలిస్తే ఊరుకునేది లేదు. నిర్మాణదారులు తప్పకుండా నిబంధనలనుకుణంగా భవనాలు నిర్మించుకోవాలి.

– ఆదర్శ్ సురభి, కేఎంసీ కమిషనర్

క్లుప్తంగా

శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీపీ, తండావాసులు

కూసుమంచి: మండలంలంతోని గోరీలపాడు తండాలో నూతనంగా నిర్మించనున్న రామాలయ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ సరస్వతీ దంపతులు నిర్మాణ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు వాసంశెట్టి వెంకటేశ్వర్లు, నలబోలు చంద్రారెడ్డి, ఎంపీటీసీ మోదుగు వీరభద్రం, సర్పంచ్‌లు మోహన్, వెంకన్న, కోటూ నాయక్, బీఆర్ఎస్ నాయకులు చాట్ల పరుశురాం, శంకర్, టీడీపీ రాష్ట్ర నాయకుడు జర్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూముల కౌలు వేలం గురువారం నిర్వహించారు. సర్వే నంబర్ 394లోని 16.4 ఎకరాల భూమిని రూ.4.08 లక్షలకు రైతు వెంకటేశ్వర్లు దక్కించుకున్నాడు. కాగా, గత ఏడాది రూ.3.20 లక్షలు పలకగా, ఈసారి రూ.88వేలు అదనంగా ఆదాయం నమోదైంది .దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఈఓ పి.నారాయణచార్యులు, అర్చకులు తాటిపాములు లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న మహ్మద్ జావీద్, నాయకులు

ఖమ్మం సహకారనగర్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర 600కి.మీ. పూర్తికావడంతో కాంగ్రెస్ నగర కమిటీ ఆధ్వర్యాన గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ కేక్ కట్ చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతూ భట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పల్లెబోయిన చంద్రయ్య, ముజాహీద్, శంకర్, దాసరి పూర్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌కు ఎస్సీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)కు ఇద్దరు ఎస్సీ విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో హెచ్‌పీఎస్‌కు లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. హెచ్‌పీఎస్‌కు 11 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. లాటరీ పద్ధతిన ఇద్దరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ వి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్–2
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	46		10
కాకర	36	చుక్కకూర	2
సొరకాయ	16		10
బీర	50	తోటకూర	2
దొండ	24		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	36		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

‘దేశాన్ని అమ్మే పనిలో మోదీ ప్రభుత్వం’


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే దేశాన్ని తూకంలో పెట్టి మరీ బడా కార్పొరేట్ సంస్థలకు అమ్మడం ఖాయమని సీఐటీయూ ఖమ్మం జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురువారం బైపాస్ రోడ్డు కూరగాయల మార్కెట్ వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిన ఘనత మోదీకే దక్కుతుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే దేశ ప్రజలు మరిన్ని కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై విక్రమ్, భుక్యా శ్రీను, బోడపట్ల సుదర్శన్, కంపాటి వెంకన్న, బీరప్ప, నర్రా రమేష్, డి. వీరబాబు, ఉపేంద్ర నాయక్, ఫకీరు సాహిబ్, జె.వెంకన్న బాబు, రాజేష్, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖానాపురం సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంపై ఖమ్మం అర్బన్ పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఈనెల 2న ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఆశా కార్యకర్త రేమళ్ల అనసూర్య తిరిగి ద్విచక్ర వాహనంపై రఘునాథపాలెం వెళ్తుండగా వెనక నుంచివచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈఘటనలో ఆమె గాయపడగా, బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

లైసెన్స్ లేకుంటే 25 శాతం పెనాల్టీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో వ్యాపారం చేసే ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే 25 శాతం పెనాల్టీ విధించి లైసెన్స్ జారీ చేయాలని రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కేఎంసీ సమావేశ మందిరంలో ట్రైనీ కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి ట్రేడ్ లైసెన్సుల జారీపై అధికారులు, బిల్ కలెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. లైసెన్స్ లేని దుకాణాలను కొత్త లైసెన్సులు జారీ చేయడంతో పాటు గత ఆర్థిక సంవత్సరంలో లైసెన్స్ తీసుకున్న వారికి తిరిగి రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ కోసం నగరంలో తిరిగి ఆరు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్సుల జారీలో సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా రోజుకు ఎన్ని లైసెన్సులు జారీ చేశారో కేఎంసీలో నమోదు చేయాలని పేర్కొన్నారు. వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌వో జి.శ్రీనివాసరావు, ఆర్ఐలు కె.శ్రీనివాస్, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదర్శ్ సురభి

తరుగు దోపిడీని అరికట్టాలి


మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: రైతుల వద్ద నుంచి మిల్లర్ల తరుగు దోపిడీని వెంటనే అధికారులు అరికట్టాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనలు లేకుండా కాంటా వేసి వెంటనే ఎగుమతులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం నాయకులు పగిడికత్తుల రామదాసు, పగిడికత్తుల నాగేశ్వరరావు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

శ్రమకు తగిన వేతనాలు అందడం లేదు..

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య కార్మికులకు శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య అన్నారు. గురువారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన వేతనం వారి శ్రమకు తగిన విధంగా పెంచలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ఉన్నా ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి దున్న గురువయ్య, వీరబాబు, ప్రసాద్, నాగరాజు, యుగంధర్, రాజు, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ కార్యాలయంలో సెమినార్

ఖమ్మంమయూరిసెంటర్: కారల్‌మార్క్స్ 205వ జయంతిని పురస్కరించుకొని ‘మార్క్సిజం–సమాజంపై ప్రభావం’అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించనున్నట్లు సీపీఐ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ బాధ్యులు శింగు నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఉదయం 10 గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని టౌన్–2 పరిధిలోని 11 కేవీ బస్టాండ్ ఫీడర్ మరమ్మతుల పనుల దృష్ట్యా ఆ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మయూరీసెంటర్, మీ సేవా, పెవిలియన్ గ్రౌండ్, మామిళ్లగూడెం, సాయిబాబా టెంపుల్, బస్ డిపో వెనుక ప్రాంతం, ఆర్డీఓ ఆఫీస్, భక్త రామదాస్ కళాక్షేత్రం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

తిరుమలాయపాలెం: ఎందరో అమరుల త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని గోల్‌తండా పరిధిలోని జింకలగూడెంలో మేడే వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మి, నాయకులు పేరాల శ్రీకాంత్, బ్రహ్మచారి, సర్దార్, నాగుల్‌మీరా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్ల సాధనే లక్ష్యం


మాట్లాడుతున్న బండి రాంరెడ్డి

ఖమ్మం సహకారనగర్: మెడికల్ సీట్ల సాధనే లక్ష్యంగా తాము ముందుకెళ్తున్నట్లు భవిష్య మెడికల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బండి రాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం అకాడమీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అధిక సంఖ్యలో విద్యార్థులకు మెడికల్ సీటు సాధించాలనే లక్ష్యంతో సంస్థను ఏర్పాటు చేశామన్నారు. నాణ్యమైన విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల అధినేతలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి జయంతి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారి జయంతి వైడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతుల్లో వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి జయంతి వేడుకలను ఉదయం 5:30 గంటల నుంచి మంగళవాయిద్యాల నడుమ ప్రారంభమయ్యాయి. స్వామి వారి జయంతి వేడుకల్లో భక్తులు పాల్గొనగా.. ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

నేలకొండపల్లి: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె గురువారం ఏడో రోజుకు చేరింది. ఈ సమ్మెకు సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సమ్మెలో భాగంగా నేలకొండపల్లి మండల చిత్రపటం వేసి రంగవల్లులతో తీర్చిదిద్ది నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బైరం దినేష్‌కుమార్, నాయకులు బోళ్ల వీరబాబు, లింగరాజు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మహేష్, సత్యనారాయణ, గోపిక తదితరులు పాల్గొన్నారు.

ఏ మొక్కనూ వదిలేయొద్దు..

నేలకొండపల్లి: అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలో ఏ ఒక్క మొక్క కూడా చావకుండా చూడాలని అదనపు డీఆర్‌డీఓ శిరీష సూచించారు. మండలంలోని కోనాయిగూడెంలో గురువారం అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. అంతేకాక హరిత హారంలో ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.అదే విధంగా ప్రతీ పంచాయతీలో ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచి పని అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించే విధంగా పనులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కూలీలు మారిన నిబంధనలు ప్రకారం పనులు తప్పకుండా చేయాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్స్ తిగుళ్ల భాస్కర్, వడ్లమూడి శ్రీనివాసరావు, వన సేవక్ గుర్రాల చంద్రహాస్ సిబ్బంది బొడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య తదితరులు పాల్గొన్నారు.


మొక్కలను పరిశీలిస్తున్న శిరీష

‘తెలంగాణ భరోసా’ వాల్ పోస్టర్లు విడుదల


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కామేపల్లి(కారేపల్లి)/ఖమ్మంరూరల్: ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న బీఎస్పీ తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకులు తెలిపారు. గురువారం ఈమేరకు కామేపల్లిలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కామేపల్లి మండల బీఎస్పీ అధ్యక్షుడు చిలుముల శ్రీనివాస్, బీఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకుల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ కుటుంబ పాలనలో అణచివేతకు గురవుతుందని, బహుజనులు రాజ్యాధికారం సాధించాలంటే.. బీఎస్పీకి మద్దతుగా నిలిచి బలపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాధావత్ ప్రతాప్, చిప్పలపల్లి శ్రీనివాసరావు, అజ్మీర వెంకన్న, కృపమ్మ, మేరీ, వీరబాబు, హైమావతి, వీరభద్రమ్మ, వెంకన్న, లక్ష్మి, చంద్రశేఖర్, విజయ, గోపి, సురేష్, శ్రీకాంత్, భిక్షం, పిచ్చయ్య, సీహెచ్. సత్యనారాయణ, రవి, భరత్, ఉపేందర్, రమణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏడీకి వినతి..

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వేసవిలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్‌లు కోరారు. గురువారం డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రసాదరావు, వెంగళరావు, మల్లయ్య, యాకుబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో కోదాడ ఎమ్మెల్యే..

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో పుచ్చకాయల అనంతరాము –జయలక్ష్మి దంపతుల కుమార్తె ఎంగేజ్‌మెంట్ కార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని కాబోయే నూతన జంటను ఆశీర్వదించారు. ఆయనతో పాటు అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య యువజన విభాగం అధ్యక్షుడు చిత్తారు సింహాద్రియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తండాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఖమ్మంరూరల్: గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బంజారా సేవా సంఘం పాలేరు నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని గోళ్లపాడుకు చెందిన తేజావత్ పంతులునాయక్ గురువారం తుమ్మలను మర్యాద పూర్వకంగా కలిశాడు. ఈసందర్భంగాపంతులునాయక్‌ను శాలువాతో సన్మానించి తుమ్మల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, తుపాకుల ఎల్లకొండస్వామి, తోట వీరభద్రం , ఎం.విజయ్, తేజావత్ ఎల్లయ్యనాయక్, షేక్.సైదులు, బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి రూపంలో విగ్రహాన్ని పెట్టొద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఖమ్మం ట్యాంక్‌బండ్‌పై పెట్టొద్దని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని పెడితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. జాతీయ అధికార ప్రతినిధి దేవేందర్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు అల్లిక వెంకటేశ్వరావు యాదవ్, జిల్లా అధ్యక్షుడు కోటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఈటలను కలిసిన బీజేపీ నేతలు


ఈటల రాజేందర్‌తో బీజేపీ నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసానికి వచ్చిన బీజేపీ చేరికల కమిటీ బృందాన్ని బీజేపీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో పాటు ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలను కలిశారు. కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఉప్పల శారద, డాక్టర్ శీలం పాపారావు, నంబూరి రామలింగేశ్వరావు, జిల్లా ఎడ్యుకేషన్ వింగ్ అధ్యక్షుడు ఆచాంటి కోటేశ్వరావు, బోడెపుడి రాజా, కోణతం లక్ష్మీనారాయణ గుప్త, కొప్పెర జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిని ఉపేక్షించొద్దు..

కూసుమంచి/ ఖమ్మంమామిళ్లగూడెం: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టా తన వద్ద ఉందని సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పినందున వారి పేర్లు బహిర్గతం చేసి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు ఖమ్మంలోని ధర్నా చౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన, కూసుమంచిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటనను తాము స్వాగతిస్తున్నామని, వివిధ పథకాల్లో అవినీతికి పాల్పడే ఎమ్మెల్యేలు, అధికారులను తొలగించాలని, వారు దోచుకున్న ప్రజల సొమ్మును తిరిగి రాబట్టి వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు బచ్చలకూరి వెంకటేశ్వర్లు, పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాదిగ, నాయకులు నాగభూషణం, బాబు, రవీంద్రబాబు, వీరభద్రం, దర్గయ్య, అంజయ్య, రాము, జనార్దన్ , శ్రీను, సైదులు, శ్రీనివాస్, నరసింహరావు, రమా, వెంకన్న , వీరబాబు, నాగరాజు, హన్మంతరావు, ప్రసాద్,సురేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు